# ఆకాశం

-అబ్బూరి వరదరాజేశ్వరరావు (1923-1993)

**తెలుగు సాహిత్యంలో ఆయనదొక విశిష్టస్థానం. రాయడం కన్నా రాయించిన రామభద్రుడు. కవన కుతూహలం, కవితా సంచిక సంపుటాలుగా వెలువరించారు. కవుల గురించి, స్వీయానుభవాలను రంగరించి "వరద కాలమ్" నిర్వహించారు. 14 భారతీయ భాషలలోని కవితలను ఏర్చికూర్చి, "మోడరన్ ఇండియన్ పోయిట్రీ" సంపుటిని 1958, నవంబర్ 14న నెహ్రూకి బహూకరించారు. ఆకాశం కథ 1950లో రాశారు. దాదాపు 40 ఏళ్ల తర్వాత ఆంధ్రజ్యోతి దీపావళి సంచికలో అచ్చయింది. ది స్కై పేరుతో రచయితే ఆంగ్లీకరించారు. ఆణిముత్యాల పరంపరలో మా పాఠకులకు యీ ఆకాశాన్ని అందిస్తున్నాం.**

మనిషికి చావు తప్పదని అందరికీ తెలుసును. ఎప్పుడు పోతారో యెవరికీ తెలియదు. ఇన్నాళ్ళు బతగ్గలనని ధైర్యం చేసి చెప్పగలిగిన వారెవరూ లేరు. ఇంట్లో యెవరికీ తెలియకుండా పోయిన వారున్నారు. దీర్ఘాయువు గురించి ఉపన్యసిస్తూ గుండె ఆగి బాధ అన్నా లేకుండా పోయిన వాళ్ళూ ఉన్నారు. వేదాంతం, పరలోక ప్రయాణ రహస్యం- ఇవన్నీ సాకల్యంగా మనస్సు కెక్కించుకుని, తీరా చావు దగ్గిర పడుతోంటే భయపడుతూ పోయినవాళ్ళున్నారు.

పోతున్నానని చెప్పి పోయిన వాళ్ళ నెరుగుదుం. మరో పదేళ్ళదాకా జీవితానికి యేం ఫరవాలేదని, హస్త రేఖలూ, జన్మనక్షత్రం చూపించుకుని చెప్పించుకున్న మర్నాడే పోయిన వాళ్ళు లేక పోలేదు. మనిషికి చావంటే యేవిటో విజ్ఞానశాస్త్రం చదువుకున్న వారందరికీ తెలుసును. మనిషి గతం అంతా మృత్యుఘోష వెదజల్లిన చరిత్రే కదా!

ఆ రోజు మధ్యాహ్నం, నట్టెండలో కాలుతున్న చితికి దూరంగా కూర్చుని అతనెందుకలా యేడుస్తున్నాడు?

అతనికి తెలియకనా, మనిషికి చావు తప్పదని?

పురోహితులు వేద పఠనం చేస్తున్నారు. చితి నుంచి పొగలు రేగి నలుమూలలా శూన్యాన్ని వెతుక్కుంటూ పోతున్నవి. ఆ మరణించిన మనిషి కాసిన కలలూ, మోసిన వెతలూ అన్నీ అక్కడికే చేరుకుంటున్నవి.

ఆ నట్టెండలో యేడుస్తున్న అతనొక్కసారి ఆకాశంలోకి చూశాడు. సూర్యరశ్మి తీక్షణంగా వుంది. కనులు చీకట్లు కమ్మినయి. వెలుతురుకోసం వెదికితే చీకటి ప్రాప్తమవుతోందెందుకనుకున్నాడు. ఇదే సృష్టి రహస్యం? చావు బ్రతుకుల మధ్య విభాగ రేఖ అదేనా?

అతనాలోచిస్తున్నాడు.

ఆ మరణించిన వ్యక్తి జీవితాన్నంతా

**ఆణిముత్యాలు**

శోధిస్తున్నాడు. ఆయన సాధించిందేమిటి? ఆయన సాధించింది ఆ మరణం తప్ప మరొకటి కనిపించడం లేదు. ఆయన జీవించాడు. అంతే. ఆ జీవించడంలో కళాతృష్ణ, స్త్రీ వ్యామోహం, ప్రజా హితైక కాంక్ష, తాత్త్విక వైరాగ్యం భిన్న భిన్నంగా ప్రబుద్ధమయిన మాట వాస్తవం. ఆ చివరి దశలో తాత్త్విక వైరాగ్యం ఆయన మనస్సును వశం చేసుకున్న రోజుల్లో కూడా, పరస్త్రీ దేహాన్ని ఆయన సర్వస్వం సమాశ్రయించుకునే వున్నది. ఆవిడ వితంతువు. కొంచెం దూరపు బంధువు. చెల్లెలి వరస! వైరాగ్యంతో పాటు వితంతు సంపర్కం పెరిగి, కుటుంబానికి దూరం కాదగ్గ

పరిస్థితి కూడా యేర్పడింది.

ఆ చితి కాలుతూనే వుంది. నెత్తిమీద తువాలు కప్పుకొని యింటికి బయలు దేరాడతను. ఆ కుగ్రామంలో, దారి పొడుగునా, జనం జాలిగా అతని వంకే చూస్తున్నారు.

ఇల్లు నిశ్శబ్దంగా వుంది. అతని కాళ్లు వొణికి పోతున్నవి. సింహద్వారం సమీపించాడు. బయటనే నిలిచి పోయాడు. వెనక్కి తిరిగి పక్క గుమ్మం నుంచి దొడ్లో బావి దగ్గరకు పోయాడు స్నానం చేయడానికి.

దొడ్లో చాలా మంది జనం వున్నారు. పక్కన తులసి కోటకు పక్కగా ఆ అమ్మాయి కూర్చునుంది. ఆ మరణించిన ఆయన పెద్దకూతురు. అకస్మాత్తుగా అతనా పిల్ల ముఖంలోకి చూశాడు. అతని చూపుల్లో జాలి తప్ప మరొక భావం ప్రస్ఫుటం కావడంలేదు. ఆ అమ్మాయి ముఖంలో దైన్యం, భవిష్యదంధకార మాలిన్యం మాత్రం స్ఫురిస్తున్నాయి. కళ్ళల్లో నీళ్ళు లేవు. అతని కాశ్చర్యం వేసింది. తన కంటి నీటి మరకలింకా ఆరిపోనయినా ఆరిపోలేదు. తనెవరు అసలు కంట నీరు పెట్టేందుకు? కన్న కూతురు యేడవదేం? ఆ దుఃఖాన్నంతా కడుపులో దాచి పెట్టుకుందా? అతని కర్థం కాలేదు.

ఆ అమ్మాయి కూచున్న చోటికి వెనకనే బావి వుంది. తరతరాల నుంచీ ఆ బావిలో నీళ్ళు తోడుతూనే వున్నారు. ఒక్క సారయినా నీరింకిన పాపాన పోలేదు. ఆ అమ్మాయికీ ఆ బావికీ ఒక తెగని సంబంధం వుంది. ఆ అమ్మాయి అంతరంగంలో అట్టడుగున దాచి పెట్టుకున్న రహస్యం ఆ బావికే తెలుసును. అయితే బావికి పూర్వ స్మృతి పోయి వుంటుంది. పాత నీరు పోయి యేనాడాయె. వాటి గర్భంలోనే విరజిమ్ముకున్నది. ఇంత వరకూ, అనేక విధాలుగా యెందరో అనుకున్నారే తప్ప ఆ రహస్యాన్ని యిదమిత్థంగా కనుకున్న వారు లేరు. ఆ రోజున ఆ అమ్మాయి బావిలో పడినప్పుడు, ఆ పిల్లకీ, విడిచి పెట్టిన మొగుడుకీ మధ్య యెంతో అగాధం వుందని మాత్రం తండ్రీ తల్లీ గ్రహించారు. ఎలాగయితే నేం బతికి బయటపడింది.

బావిలో మునిగి తేలుతూన్న ఆ ఘడియల్లో ఆ అమ్మాయి ఆకాశం వంక చూసింది. బతుకుపయి ఆశలేదు. ఈ జగత్తంతా, తన మనస్సును కోడి గుడ్డును చిదిపి చిలికి వేసినట్టు ద్రవీభూతం చేసింది. ఆప్తులులేని, ఆశలు లేని ఈ అవనీతలంలో తన జీవితం వ్యర్థమనుకున్నది.

మృత్యువు కాలి క్రింది రసాతలంలో ఆహ్వానం పరచినా, ఆకాశంలో జీవితం సమస్తం చిత్రణం కావడం చూసింది. ఎండా వానా, వెలుగూ చీకటి, ఉరుమూ మెరుపూ, యిన్నీ యిముడ్చుకున్న ఆకాశమే భూతల జీవితాలకు ప్రతిఫలకం. ఎన్ని సుందర సురుచిరాలయిన జలదాలు హంస గమనంతో అవధి తెలియకుండా పోతూ అకస్మాత్తుగా కరిగి పోవడం చూసింది.

స్వప్నంకాని, సత్యం కాని ఆకాశం ఆ రోజున, ఆ మృత్యు సన్నిధాన దివ్యక్షణాన ఆ అమ్మాయిని ఆప్తవదనంతో ఆదరించింది. "రా తల్లీ! మృత్యువంటే భయం దేనికి? శ్వాసకు బంధ విమోచనం మరణం తల్లీ! నాలో స్వేచ్ఛగా విహరించనీ! నీ శరీరాన్ని వొదలి, నీలో అణగారిన ఆశల్ని తెచ్చుకో రా తల్లీ"!

ఆనాటి నుంచీ ఆకాశం వంక చూసినప్పుడల్లా, ఆ అమ్మాయి మనసు జలభారంతో చలించే మేఘంలా విహ్వలిస్తూంటుంది. ఏకాంతంగా యెప్పుడయినా ఆరు బయట అపరాహ్ణం కానీ, అర్థరాత్రి కానీ కూచుంటే ఆకాశం చూసి వణికిపోతుంటుంది. మళ్ళీ అదే పిలుపు కాలి క్రింది రసాతలం నుంచి తిరిగీ అదే ఆహ్వానం.

ఊరికవతల చితి కాలుతూనే వుంది. బావి కివతల తల వంచుకుని ఆ అమ్మాయి కూచునే వుంది. ఏవాలోచిస్తోంది?

తండ్రి దమ్మిడీ మిగిల్చి పోలేదు. గంపెడంత సంసారాన్ని విడిచిపెట్టి పోయాడు. పెళ్ళికి ఈడు వొచ్చిన పిల్లలూ, జ్ఞానం రాని పాపలూ వున్నారు. వాళ్ళ గతి?

ఉన్న అన్నగారా, వయసు వచ్చినా లోకానుభవం లేనివాడు. తన ఈనాటి స్థితికి అన్నగారి ప్రాబల్యమే పరోక్షంగా కారణం. చిన్నతనం నుంచీ చెల్లెలి భావాలకు, ఊహలకూ,

## సునామీ కళ్లు తెరిచిన వేళ

సహనానికి సాకారం
నేల తల్లే కంపించింది
గాంభీర్యం చెదరి సంద్రమే
అల్లకల్లోల మయింది
నింగికి లేచిన కెరటం
వేలవేల జనాన్ని పొట్టన పెట్టుకుంది
ఇంకేముంది
ఇళ్లూ, వాకిళ్లూ కట్టెలుగా మారిన రూపం
ఎక్కడ చూసినా భీకర దృశ్యాలు
శవాల గుట్టలు! దుర్గంధాల పూరితం!
కన్న వారికోసం పిల్లల ఆక్రందనలు!
పిల్లలకోసం కన్న కడుపుల ఆక్రోశం
విధి వక్రించి, మానవాళిపై పగబట్టింది
కష్టాల కన్నీళ్లు నేల తల్లికే
పడగెత్తిన సంద్రం ఏమీ ఎరగనట్టే వూరుకుంది
చిన్న బోయి చూస్తోంది ఆకాశం
ఆకలి మంటలలో అల్లాడుతున్న జనం
గూడులేక, నిలవ నీడ లేక విలవిల్లాడె జనం
కట్టుగుడ్డలేక సిగ్గులో తలవంచే జనం
సాయం చెయ్యాలని ముందుకొచ్చిన
ప్రపంచ దేశాలు
మానవత్వం పంచే వేళ యిది?
తలొక చెయ్యి అందించండి!
గుప్పెడు బియ్యం పంచండి!
ఓ బట్ట కప్పండి
చేతి గొడుగునైన విప్పండి
ఓ మనిషికైన నీడ కల్పించండి
ఎన్నేళ్లు పడుతుందో తిరిగి
మొక్క మొలచి పచ్చదనం పరుచుకోవడానికి?
ఎన్ని దశలు తిరగాలో పగిలిన గుండెలు
భద్రపడి కాలు నిలదొక్కుకోడానికి
ఎక్కడో దూరంగా అడవుల మధ్య దీవుల్లో
పశు పక్ష్యాదులు పసికట్టిన జాడలు,
భద్రంగా తలదాచుకున్న ఆటవికులు,
మానవశక్తిని మించిన జీవశక్తి
తెలిసింది చాలదు! తెలుసుకోవలసింది ఎంతో!
సునామీ కళ్ళు తెరిచిన వేళ

ఆదర్శాలకూ తోవదిద్ది పెట్టాడు. మనకు కావలసిన ప్రపంచం యిది, రావలసిన ప్రమోదం యిది' అని కలలు గాశారు. గాలిలో మేడలు కట్టుకుని అందులో తిష్ట వేశారు. కల్పించుకున్న ప్రపంచమే నిత్యం కనిపించేది కాని, రానున్న ప్రభంజనం తట్టుకునే ధైర్యం కానీ, మనస్సు కానీ అలవడలేదు.

మొదటి రోజున పడగ్గదిలో ప్రవేశించగానే "ఈ శరీరాన్ని మీకు అప్పగించేందుకు వచ్చాను. మనస్సు మాత్రం మీ వశం గాదు". అని యెంతో సాహసంతో భర్తతో అన్నది.

ఆ భర్త సంసార సుఖాన్ని ప్రతి పాదించేందుకు వచ్చి, ఆ మాటల్ని విని చకితుడయి పోయిన మాట వాస్తవం. అకస్మాత్తుగా పుస్తకం చదువుతూంటే, కథ నిజమయి ఎదుట సాక్షాత్కరించినట్టయింది. ఆనాటి నుంచీ యిరువురికీ ఎడబాటయి పోయింది.

ఇంత వరకూ, మనస్సు శరీరం– ఈ రెంటికీ మధ్య ఎత్తుగా దట్టంగా పెరిగిన నీడలు కరిగి పోనేలేదు.

ఇన్నాళ్ళూ తండ్రి బతికున్నాడు కనక తనేం చేసినా సరిపోయింది. ఆనాటి వరకూ తన కొకటే సమస్య పీడాకరంగా వుండేది. ఈనాడు తనే ఒక సమస్య అయిపోయినట్టు భావించుకున్నది. కుటుంబ యాత్ర జరగవలసి వుంది. తండ్రి వున్నన్నాళ్ళూ యేం లోపం లేకుండా కాలం గడిచిపోయింది. ఎలా సంపాయించేవాడో, యెక్కణ్ణించి తేచ్చేవాడో కాని, కించిత్తు లోపం లేకుండా సంసారాన్ని నెట్టుకొచ్చాడు. ఆయన కనుమూసిన రోజునే, యింటిల్లిపాదీ కళ్ళు తెరిచారు. వర్తమానం శూన్యం. భవిష్యత్తు అనుమానా స్పదం.

ఈ పరిస్థితిలో తన విద్యుక్త ధర్మం కోసం వెయ్యికళ్ళతో వెదుకుతోంది.

జల ప్రళయం ! అంతా నష్టం! కష్టం!
హృదయంలేని పెను భూతం సునామీ
హృదయమున్న మానవులారా! విలవిల్లాడే
జనాన్ని ఆదుకోండి.

– డా॥ వాసా ప్రభావతి

చెల్లెళ్ళకు పెళ్లిళ్ళు కావాలే. అత్తవారింటికి మీ పెద్దమ్మాయి యెందుకు పోలేదని ఎవరన్నా అడిగితే?

అన్నయ్య సంగతి చూస్తే అదో విధంగా వుంది.

సీతని ఏమయినా సరే పెళ్ళి చేసుకోక మానని కూచున్నాడు. సీతకి పెళ్ళయి ఏనాడాయె? శాసన ప్రకారం మళ్లీ భర్త బతికుండగా సీతకి పెళ్ళి జరగడం అసంభవం. శాసనం కన్నా సమాజం మరింత దుష్కరం కదా! తనకా సంగతి మొదటి సారి అన్నయ్య చెప్పినప్పుడు, తను కూడా తనకి తెలీకుండానే ఉత్సాహపడింది. మరోటి సారి పిల్ల తనలాగే విడి పోయి తిరిగీ పెళ్ళి చేసుకోవటం ఎంత మంచి మాట? అప్పుడు కుటుంబంలో తన్నెవరేవంటారు?

అతను స్నానం చేసి నీళ్ళగదిలోనుంచి వస్తున్నాడు. ఆ అమ్మాయి ఆతపత్రంలా రెపరెపలాడుతూ వణికిపోతున్నది.

అతనికి పలకరించే ధైర్యం లేకపోయింది. తలెత్తి ఆకాశంవొంక చూస్తూ కంపించి పోతున్నది.

కొంచెం సమీపంలో నిలబడి... "మీరిలా అధైర్య పడితే యెలా?.. మీ తరువాత చిన్న పిల్లలు. వాళ్ళకి ధైర్యం చెప్పాలిగాని... "అని తనేం మాటాడు. తున్నాడో తెలీకుండానే అంటున్నాడు. అతననే మాటలు ఆ అమ్మాయికి వినబడుతున్నట్లు లేదు. అతను మాత్రం ఆగలేదు. "మీరు మీ విషయమై ఏమీ చింతించకండి. జరగవలసిన దానికి కర్తలం మనం. జరిగిన ప్రమాదానికి కారకులు మీరెవ్వరూ కారు. మీ తండ్రి గారు నీతివరులయినా కాకపోయినా మహా సాహసికుడు. నమ్మిన వ్యవహారంలో పట్టుబట్టి పనిచేసేవాడు..."

అకస్మాత్తుగా ఆ అమ్మాయి లేచి నిలబడింది. చీర చెరగులు చలిస్తున్నవి. కళ్ళల్లో నీళ్ళు పొంగి పోయినవి. అతని ముఖంలోకి తదేక దృష్టితో చూస్తున్నది. అలా ఎంత సేపని? ఆ అమ్మాయికి స్పృహ లేదు. అతని కేం చెయ్యాలో అర్థం కాలేదు. బయట వీధి గుమ్మంలో జన సమ్మర్దం వినిపించింది.

స్మశానం నుంచి అంతా వొస్తున్నారు. అతనింట్లోకి వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి వేడ మీద ఆ అమ్మాయి, అన్నగారూ, తమ్ముడూ కూచుని మాటాడుతున్నారు.

అమ్మాయి ఉద్యోగం చేస్తాననంటోంది.

అన్నయ్య మనస్సంతా సీతని ఎలా తెచ్చుకోవాల్నో అనే సమస్యపై లగ్నమయి వున్నది.

తమ్ముడు తమ్ముడే కాని తోబుట్టువు కాదు. తండ్రి ఒక వితంతువును ప్రేమించగా కలిగిన ఫలం. ఆ కుర్రాణ్ణి తతిమ్మా పిల్లలతోపాటు పెంచుతూ వచ్చారు. ఈనాడతనికి ఆకాశం భూమి తప్ప మరో ఆధారం లేకపోయింది. తల్లి తన్ను కనగానే చచ్చిపోయింది. ఇప్పుడు తండ్రీ పోయాడు.

అతనికి గతం తప్ప వర్తమానం, భవిష్యత్తు లేనేలేవు. అందుచేత అన్నా, అక్కా చేసే ఆలోచనలో పాల్గొనేందుకు ధైర్యం లేకపోతోంది అతనికి. తను కష్టపడి కుటుంబానికి సహాయపడవలెననే ఆకాంక్ష వున్నది. వుంటేమాత్రం తరువాత యేం కావాలన్నది? తనెవరు? కుటుంబానికి తనకీ యిన్నాళ్ళూ వున్న ఒక్క బంధం తెగిపోయింది. ఆ బంధ విముక్తితో నల్లడలా అంధకారమే ప్రాప్త మయిందతనికి. ఇల్లు విడిచి వెళ్ళిపోవాలనే అతని ఆత్మలో నిశ్చయం. అచిరకాల పరిచయం, అర్థంకాని బాంధవ్యం అతన్ని వెనక్కి లాగుతున్నవి.

"మీరేం చెయ్యమంటే అది చేస్తాను" అన్నాడు. పక్కగదిలో చీకట్లో కూచుని అతనాలోచిస్తున్నాడు. మనిషికి ఆప్తతా, మనస్సు ఈ రెండే మానవతా లక్షణాలు. రక్త సంబంధం, ప్రణయరక్తీ యివన్నీ తాత్కాలికాలే కాక కృత్రిమ సంబంధ ప్రేరకాలు. తనెందుకంత దూరం వచ్చినట్టు? ఆ చచ్చిపోయిన వ్యక్తితో యేం బాంధవ్యం? ఆయనకీ తనకీ కల స్నేహమే కదా బాంధవ్యబంధం. ఈ కుటుంబానికి ఈ గతి దేనికి ఈ రోజున? పరిణతి చెందని మనస్సుకు వ్యథ తప్ప మరో గత్యంతరం లేదు. వయస్సు వచ్చినా పిల్లల కెవరికీ మనస్సు పరిణతి పొందలేదు. అపమార్గాన ఆదిలోనే వారి భావాలు అభిచరించినవి. బతకడం ఎవరికీ దుర్లభం కాదు.

ఇంట్లో ఊడిగం చేసే దాసీ జనానికి పిల్లలు లేరు? సంసారాలు చెయ్యటంలా? వాళ్ళకి ఆనందం తృప్తీ లేవూ? అలాగే జీవనం జరక్క పోవడం అన్నది కల్ల...

ఆ రాత్రి చాలాసేపు వాళ్ళు ముగ్గురూ దీర్ఘంగా చర్చ చేశారు. జీవితం మళ్ళీ ప్రారంభమయింది.

పదో రోజున వాళ్ళ మేనమావా, తాత వొచ్చారు. మేనమామ అంటే కేవలం మేనమావ కాదు. తాతా అంతే. ఆ మరణించిన వ్యక్తికి పింతండ్రీ, ఆయన అల్లుడూను.

తాతగారు ఉచితంగా సలహా చెబుతారు. బాధ్యత నెత్తి మీద వేసుకోరు. మేనమామ సలహా యివ్వటమే కాక, కలుగజేసుకుంటారు. ప్రతి చిన్న వ్యవహారంలోనూ తాను చెప్పినట్లు ప్రతివారూ వినాలని ఆయన కొక జీవిత పరమావధి. బాధ్యత మళ్ళీ కించిత్తు లేదు.

మేనమావకు పన్నెండు మంది సంతానం. నిద్ర మినహాయిస్తే, కళ్ళు మూసుకోనంత కాలమూ ఆయనేదో మాటాడుతూనే వుంటాడు. దానికి సందర్భమూ, ఔచిత్యమూ అనవసరం. పరాయి వాణ్ణి యే విధంగా చిన్న బుచ్చాలనే ప్రయత్నం తప్ప ఆయన ధోరణిలో, ఆలోచనలో, ఆచరణలో మరొకటి కనిపించదు.

తాతగారూ, మేనమావా యిద్దరూ కలిసి ఆలోచించుకున్నారు.

కుటుంబాన్ని నైతిక పతనం నుంచి తప్పించ వలెననే సంకల్పం వాళ్ళిద్దరిదీని.

అమ్మాయిని యేదో విధంగా తిరిగి మొగుడి దగ్గరికి పంపించాలి. అబ్బాయికి వేరే వివాహం వెంటనే చేయించి తప్పుడు త్రోవ నుంచి మళ్ళించాలి.

ఇంట్లో భోజనం, కర్మకాండకు కావలసిన ఖర్చు యెలా జరుగనున్నదో వాళ్ళకి తట్టలేదు.

అమ్మాయి అంటే మావకు త్రాచుపాము పగ. మొగుడి దగ్గరికి యెందుకు పోదు అన్నదే ఆయనకి సమస్య. స్త్రీ అంటే పిల్లల్నికనే యంత్రంగా ఆయన పరిగణించడం పరిపాటి. జావ చెట్టు యెన్ని కాయలు కాస్తే అంత ఆనందం, తృప్తీ తోటమాలికి. స్త్రీ యెంత మంది పిల్లల్ని కంటే అంత ఆనందం ఆయనకి. అమ్మాయి మనస్సు కనుక్కుని తగిన ఆలోచన చెప్పవలెనని లేదు. అమ్మాయిని మొగుడి దగ్గరికి పంపించి బలాత్కారంగా కాపరం చేయించాలన్నది ఆయన అంతరంగంలోని అభిలాష. అందుకోసం ఆయన యేం చెయ్యడానికన్నా సిద్ధంగా వున్నారు. అమ్మాయి నీతిమంతురాలు కాదని ప్రారంభించాడు. స్కూల్లో చదువుతున్నప్పుడు ఎవరో కుర్రాడితో లేచిపోయేందుకు ప్రయత్నం చేసిందని పదేళ్ల క్రింది గాథను జ్ఞాపకం చేశాడు. అమ్మాయికి అసలు స్త్రీత్వం వుందో లేదోనని అనుమానం అని కూడా అన్నాడు. మొగుడి దగ్గరకు పంపించేందుకు తనెన్ని సార్లు ప్రయత్నం చేశాడో, ప్రతీ ప్రయత్నాన్నీ ఆ అమ్మాయి యే విధంగా ఎదిరిస్తూ విఫలం చేసిందో యేకరువు పెట్టాడు.

బంధువులంతా వెళ్ళిపోయే రోజున తాతగారు ప్రత్యేకంగా అమ్మాయిని పిలిచి భర్త దగ్గరికి పోవాల్నని గట్టిగా చెప్పారు. గతాన్ని మరచిపోదలచుకున్నానని ప్రత్యుత్తర మిచ్చింది.

"పట్నం వొచ్చి ఉద్యోగం చేస్తుంటే నీ శీలాన్ని కాపాడుకునే ధైర్యం వుందా?" అని నిస్సంకోచంగా అడిగారు. ప్రమాణం చేసి చెప్పింది, కుటుంబానికి

---

## కనుగొనడం కోసం

పరిస్థితిని
ఎప్పటికప్పుడు వెల్లడించే
ఆన్ "లైన్"...
సమాచారం
నిత్య ప్రదర్శనానికి
టీవీ ఛానల్స్...
ఇక–
మనసు విప్పి
మాట్లాడే మనిషిని
కనుగొనే శాస్త్రవేత్త కోసమే
నిరంతర అన్వేషణ....!?!

– సోమేపల్లి వెంకటసుబ్బయ్య

---

తన మూలకంగా యే విధంగానూ కళంకం ఆపాదించనని.

మేనమావకు దీంతో తృప్తి కలగలేదు.

ఇంట్లో అందరి కన్నా బంధువుగా తిరుగుతున్న అతని మీదకు మళ్ళించారు ఆలోచన. అతనెవరు? ఎందుకొచ్చాడు? ఈ కుటుంబంతో ఏం సంబంధం? అమ్మాయికి అతనంటే అంత ఆదరం యెందుకు? అబ్బాయికి అతనంటే అంత అభిమానమెందుకు? అమ్మాయికీ, మొగుడికీ మధ్య అతనొక మేరు పర్వతంలా కనిపించాడాయనకి?

తండ్రికి అపర కర్మలన్నీ పూర్తయ్యాక కుటుంబం పట్టణానికి వచ్చేశారు. రోజులు గడుస్తున్న కొద్దీ తండ్రిని గురించి చింతించడం మానేశారు. అన్న గారికి సీతా చింతనం మరింత యెక్కువయి పోయింది. తనూ, కుటుంబం ఈ రెండింటికీ వ్యత్యాసం కల్పించేందుకు యిరవయి నాలుగ్గంటలూ ఆలోచిస్తున్నాడు. స్వార్థం మినహాయిస్తే మనిషి జీవితం వ్యర్థం అనే సిద్ధాంతానికి వచ్చాడు.

కుటుంబ యాత్ర సాగుతున్నదే కాని అతని మనస్సుకు శాంతి లభించడం లేదు. మనస్సును ఆలోచించనీయడం మానేశాడు. మెల్లిమెల్లిగా మనస్సును కాస్త యిరువురి వశం చేశాడు.

అందులో ఒకాయన చదువు కున్నవాడు. స్థితిపరుడు, ఉద్యోగం చేసుకునేవాడు. అతనికి స్నేహితులంటూ ఆ పట్టణాన్ని గాలించి వెదికినా దొరకరు. ఎన్నో విపరీత కార్యాలు చేయవలెననే విపరీత కాంక్షలు. అందుకు ధైర్యం లేదు! ఆ కాంక్షల్ని చెప్పుకునేందుకు ఆప్తులూ దొరక లేదతనికి. ఆయనకి పెళ్ళయి ఒక కుర్రాడు కూడా పుట్టాడు. ఈ కుటుంబానికి కొంచెం దూరపు బంధువు కూడాను. ఆయన అక్కగార్నే ఆ మరణించిన వ్యక్తి చివరి దాకా అనుభవిస్తూ పోయాడు. ఆయన ప్రేమించాల్ననే ఆవేదనలో చిక్కుకుని చివరికి నలుగురు పిల్లలున్న ఒక వితంతువును ప్రేమించడం ప్రారంభించాడు. ఆవిడ తన కులానిగ్గానీ, జాతిగ్గానీ చెందని. ఆవిడతో మాట్లాడతాడే తప్ప మరేం చేసేందుకు సాహసం లేదు. తన ప్రేమ పురాణాన్ని ఆ అమ్మాయి అన్నగారితో మాత్రమే చెప్పుకుని తృప్తిపడుతూంటాడు.

కట్టుకున్న పెళ్ళాం చచ్చిపోతే బాగుణ్ణను కున్నాడు. వృద్ధుడయిన తండ్రి ఎప్పుడు పోతాడా అని రోజులు లెక్కించడం ప్రారంభించాడు. అతని మనస్సు పగిలిన గాజు పెంకుల కుప్ప. ఒక్కొక్క పెంకులోంచి ఒక్కొక్క రూపం కనిపిస్తూంటుంది. తన జీవితంలో ప్రేమ ఫలం లేకపోవడమే ఒక పెద్ద లోపం అని గాఢ విశ్వాసం. ఆ ఒక్క లోపమూ పూర్తి అయితే తన బతుకు పరిపూర్ణమవుతుందని ఆశయం. పగలల్లా తలకు స్థిమితం వుండదు. సాయంకాలం కాగానే వాళ్ళింటికి పోయి కూచుంటాడు. గంటల కొలదీ ఆ అమ్మాయి అన్నగారితో వ్యర్థ ప్రసంగం చేస్తూంటాడు. ఏ ప్రసంగం చేసినా అందులో ముఖ్యాంశం స్త్రీ పురుష సంబంధాలూ, వాటికి అనుబంధించిన గాధలూ. తనిలా మాటాడుతూంటే ఆ అమ్మాయి వినాలనీ, తన చమత్కారానికి అభినందించాలనీ అతని అభిలాష. ఆ అభిలాషలోనే తన జీవితంలో కలగని తృప్తి కలుగుతూంటుంది.

ఎవరన్నా ఒక స్త్రీని నీతిపరురాలు కాదని తోచినప్పుడు, చంచల బుద్ధి అయిన పురుషుడికి ఆవిడ మీదే మనస్సు పోతుంది, ఆ స్త్రీ అందకత్తెకానీ కాకపోనీ. అదే స్త్రీ నీతి మంతురాలని తెలిసినప్పుడు ఎంత వాడయినా ఆవిడవంక కన్నెత్తి చూసేందుకు సాహసించడు. ఆ యింట్లో ఆ అమ్మాయి యే కారణాన్నయితే నేమీ మొగుణ్ణి విడిచి పెట్టింది. అది యెంత సంస్కారికయినా, అపమార్గంగా తోచక పోదు.

ఈ విధంగా సమాజంలో అసహజ ప్రవృత్తి కలవారితోనే ఇటువంటి వ్యక్తులు స్నేహం చేసేందుకు ప్రయత్నిస్తారు. అదే మర్యాదననుసరించి అన్నగారికీ ఆయనకీ స్నేహం కుదిరింది. ఇతర వ్యాపకాల్లో వారిద్దరికీ ఎంత వైరుధ్యం వున్నా ఈ ఒక్క విషయంలో అభిరుచులు కలిసిపోయినయి.

సీత కోసం అన్నగారు సర్వస్వం త్యజిస్తానని కూచున్నాడు. త్యజిస్తానని ఆవేదన పడడమే తప్ప,

తన్మూలకంగా కుటుంబానికి దూరం కాగల గుండె లేదు అతనికి.

అయితే పట్నంలో బంధువర్గంలోనూ, ఆప్తవర్గం లోనూ ఈ కథ అంతా తెలిసిపోయింది. ఇది కేవలం వ్యభిచారమే అన్నారు కొంచెం పూర్వాచార పరాయణులు. కొందరు జాలి పడ్డారు. తండ్రి బుద్ధులే వీళ్ళకీ దాపురించినవని.

## సునామీ నానీలు

రేవు అల
ఎంత నంగనాచివి!
వృకోదరమేకాదు
చుప్పనాతివి కూడా!

నీ పోటు అంతా
అనాథలపైనే
ఎంత మథించినా
గరళమేగా ముందు

ఆస్వాదయోగ్యం
కాదని తెలుసు కానీ
ఇంత
మెత్తని పులివనుకోలేదు

అణు పరిశోధనలపై
కన్నెర్ర?
బడుగు జీవులపై
బ్రహ్మాస్త్రమా?

ఉప్పాట
ఆడుకోవచ్చుగానీ
ముందుగా మరి
కూతకూయవద్దా?

ఓ సీ
ఎంత రాజకీయమే!
ఇదీ
ఎన్‌కౌంటరేగదా!

– డా॥ ద్వా.నా.శాస్త్రి

ఆ వితంతువుని ప్రేమించిన పెద్ద మనిషికి మేనల్లుడొకడున్నాడు. ఇరవయి సంవత్సరాల ఈడు వచ్చిందే కాని, స్త్రీ అంటే ఏమిటో అర్థం కాని వాడు. ఆడ వాళ్ళ మధ్య తప్ప తిరగడు. ఎవరయినా స్త్రీ పురుష సంబంధాలపయి చర్చ చేస్తుంటే, బొడ్డు విడని పసికూనలా తదేకధ్యానంతో వింటూంటాడు. ఆ కుర్రాడు యిరవయి నాలుగు గంటలూ ఆ అమ్మాయితోనే కాలక్షేపం చేస్తుంటాడు. ఆ అమ్మాయిని ఒంటరిగా ఎక్కడికీ పోనివ్వడు. అంతే కాదు. పరాయి వాడితో కర్మంజాలక ఆ అమ్మాయి మాటాడితే, అతనికి బాధాకరంగా వుంటుంది. ఆ దృశ్యాన్ని వికృతం చేసి వేరే పుస్తకంలో రాసిపెట్టుకునేవాడు. ఇతర్లతో మాట్లాడకుండా చేసేందుకు, అమ్మాయి నీతి పరురాలు కాదని వాళ్ళతో చెప్పేవాడు. ఆ మొగాళ్ళు వొఠి దుర్మార్గులని అమ్మాయికీ చెప్పేవాడు.

చెల్లెళ్ళకు పెళ్ళిళ్ళు కావడం లేదేమి అని అందరూ అడగడం ప్రారంభించారు. అన్నగారి సంగతి అందరికీ తెలుసును. తండ్రి కీర్తి ఎరుగుదురు. తెలిసినా అన్నగారు తన ప్రయత్నం మానుకోవడం యిష్టం లేక.. "మా పెద్ద చెల్లెలు దీనికంతా ఆటంకంగా వుంది" అని జవాబు చెబుతూ వొచ్చాడు.

ఒక రోజు మేనమావ వొచ్చాడు. అమ్మాయి వల్ల కుటుంబం బాగుపడదనీ, అమ్మాయి పూర్తిగా చెడిపోయిందనీ, ఊరంతా కాకిగోల చేసి వెళ్ళిపోయారు. ఇల్లంతా పెద్ద గొడవ అయిపోయింది. కుటుంబ గౌరవానికి అమ్మాయి పెద్ద అంతరాయం అయిపోయిందని అందరూ లోలోపల అనుకోవడం మొదలు పెట్టారు. అన్నగారూ అదే భావానికి బలి అయిపోయినారు. ఆ వితంతువును ప్రేమించిన పెద్ద మనిషి కూడా, ఆ యింటికి ఎవరన్నా వొస్తే తన ఆంతర్యానికి భంగకరమని మరెవరూ రావడం యిష్టం లేక, అమ్మాయి ప్రవర్తన అనుమానాస్పదమేనని అంటూ వొచ్చాడు. తను కట్టుకున్న ఆ కాకి గూడులో యితర్లెవరికీ ప్రవేశార్హత వుండరాదని అతని కోరిక.

ఆ అమ్మాయి యిదంతా విని చకితురాలయి

పోయింది. ఒక్కమాట అనలేదు. తనింట్లో నించి వెళ్లిపోతే బాగుణ్ననిపించింది. ఈ చితికిన కుటుంబానికి యింత దుఃఖం తెచ్చి పెట్టేది తనే కనక తను దూరమయిపోతే, వాళ్ళందరికీ సహాయపడినట్ల వుతుందనుకుంది. తను ఉద్యోగం చేస్తూ యింట్లో ఆర్థికంగా యెంతో సహాయ పడుతున్న మాట వాస్తవం. రేపు తిరిగే మనస్సు విరుచుకుని భర్త దగ్గరికి పోతే పిల్లలేవయి పోతారు? తనెలా సహాయం చెయ్యగలుగుతుంది? ఒక రాత్రల్లా గుండె విప్పుకుని యేడ్చింది.

మర్నాడు పొద్దున్నే అన్నగారితో అన్నది. "మీ పురోభివృద్ధి కోసం నేనే త్యాగవన్నా చెయ్యడానికి సిద్ధంగా వున్నాను. నాలో నించి మనస్సును పెరికి పారేసుకున్నాను. ఆయన దగ్గరికి పోతాను. అన్నయ్యా, క్షమించు."

ఈ మాట విన్నా నమ్మలేకపోయాడు అన్నగారు. చెల్లెలు కనక నిజంగా అన్న ప్రకారం వెళిపోతే కుటుంబ భారాన్ని తనొక్కడూ రేపట్నించి యెలా మోయడం? ఈ సంగతి అతనెప్పుడూ ఆలోచించనయినా లేదు. ఒక్కసారిగా, జీవన యాత్రలో భీరుత్వం ఆవహించిందతన్ని.

"ఆయన మళ్ళీ రానిస్తాడని ఎలా నమ్మకం?..." కొంచెం బాధాకరంగా, ఉద్రేక పూరితంగా.. "నీకూ అతనికీ సంబంధం వుందని ఊరంతా అనుకుంటు న్నప్పుడు. ఆయనకి మాత్రం తెలియకుండా వుంటుందా? అంతా మన దురదృష్టం" అన్నాడు.

పదునయిన గొడ్డలితో గుండె మీద కొట్టినట్టన యింది అమ్మాయికి. అన్నగారింత అధోగతికి లోనవుతాడనుకోలేదు. తన్నా విధంగా శంకిస్తాడని కలనయినా అనుకోలేదు. కళ్ళనీళ్ళు పెట్టి మంద స్వరంతో అన్నది. "నాన్న చచ్చిపోయినప్పుడు మనతోపాటు యేడ్చిపోయేందుకు వచ్చాడాయన. మావయ్య చెప్పింది నువ్వు కూడా నమ్ముతున్నావా?"

అన్నగారేం మాట్లాడలేదు. లేచిపోయాడు. ఆ క్షణంలో అతనికి సోదర ప్రేమకానీ, స్నేహ ధర్మంగానీ కొంచెం కూడా పట్టలేదు.

అమ్మాయి గదిలోకి పోయింది. గుండె కొట్టుకుంటోంది. మంచం మీద పడిపోదామనుకుంది. మంచం మీద రెండు వున్నకాలున్నాయి. వాటిని తీసి పక్కనే పెట్టబోయింది. వాటిల్లోనించి కొన్ని కాగితాలు రాలి కింద పడ్డాయి. ఆ కాగితాల్ని ఏరి తియ్యబోయింది. పరధ్యానంగా ఆ కాగితాలేవిటో చూడబోయి స్తంభించిపోయింది. తన దైనందిన చర్య వాటిల్లో ఉంది.

తన వెనక యింత నీడ నిత్యమూ వెన్నాడుతోందని ఎన్నడూ అనుకోలేదు. తనపై యింత అనుమానం ఆప్తులకే యెందుకు కలగాలి? తనేం పాపం చేసింది?

ఆ కాగితాలు చేత్తో పట్టుకుని నిలబడింది. ఎదురు గుండా నిలువుటద్దం వుంది. కన్నీళ్ళు తుడుచు కోవాల్నని దగ్గరికి పోయింది.

నుదుటికి కుడి వేపున గాయపు మచ్చ ఒకటుంది. చేత్తో దాన్ని స్పృశించింది. తన జీవితానికి మాసిపోని మచ్చ అదే. ఆనాటి మధ్యాహ్నం, బావీ, బతుకుపై విరక్తీ, మనస్సు శరీరాల మధ్య రేగిన పోరాటంలో తన ఓటమి అన్నీ గుర్తు కొస్తున్నవి. కళ్లల్లో నీళ్ళు నిండినవే కాని ధారలయి పొర్లడం లేదు.

అద్దం ముందు నిలబడ లేకపోయింది. "గదిలోనించి పైకి రా, రా" అనే పిలుపు సుదూర తీరాల నుంచి వినిపిస్తున్నది. కాళ్ళు తడబడుతూ వరండాలోకి వొచ్చింది. తలవాల్చుకు నిలబడింది.

మళ్ళీ ఆ బావీ, బలవంతపు చావూ కళ్ళకు కడుతున్నవి. నడుందాకా నీళ్ళు వచ్చినట్లున్నది. మునిగి పోవాల్ననుకున్నది.

ఆ నీలాకాశంలో సప్తనదులూ వర్ణ వర్ణాలతో నేలమీదకి పారుతున్నవి. మేఘాలు శరవేగంతో అవధి తెలియకుండా పోతున్నవి. ఒక క్షణం చీకటి, ఒక క్షణం వెలుగు.

ఆకాశం మహాప్తవదనంతో ఒక్కసారి ప్రఫుల్ల మయింది.

"తల్లీ యీసారి వస్తున్నానే" అని కెవ్వున కేక వేసి నేల మీద పడిపోయింది.

వైద్యుడు వచ్చి "రోగికి అంగవైకల్యం సంభవించింది! దీర్ఘ చికిత్స అవసరం" అన్నారు. ■